క్లుప్తంగా

రూ.1.29 లక్ష పలికిన లడ్డు



వినాయక నిమజ్జనంలో భక్తుల సందడి

కుప్పం: కుప్పం మున్సిపాలిటీ పరిధిలో రెండో వార్డు నారాయణపురం గ్రామంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన లడ్డు వేలం పాటలో రూ.1.29 లక్ష పలికింది. మంగళవారం వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా లడ్డు వేలం వేశారు. ఈ వేలాన్ని నారాయణపురం గ్రామానికి చెందిన హనుమంతు కుమారులు ముత్తురాజ్, రమేష్ రూ.1,29,116 వేలంలో స్వామివారి లడ్డు దక్కించుకున్నారు.

ఉపాధి పనులు కల్పించాలి



మొక్కలు నాటుతున్న ఏపీడీ శ్రీనివాసులు

రొంపిచెర్ల: ఉపాధి పథకంలో కూలీలకు పనులు కల్పించాలని జిల్లా డ్వామా అదనపు పీడీ శ్రీనివాసులు అన్నారు. ఆయన మంగళవారం రొంపిచెర్ల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జరిగిన ఉపాధి పథకం సామాజిక తనిఖీ బహిరంగ సభలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కూలీల వలసలను నివారించడానికి ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. రైతుల భూముల్లో పండ్ల తోటలను పెంచుకోవచ్చన్నారు. బంజరు భూములను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. మండలంలో 2023–24 సంవత్సరానికి 1,803 పనులకు రూ.8.95 కోట్లు ఖర్చుచేశారని తెలిపారు. ఈ పనులకు ఆడిట్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. రికార్డు నమోదులో సిబ్బంది నిర్లక్ష్యం వహించినట్లు తెలిపారు. ఇందుకు రూ.12వేల జరిమానా విధించినట్లు చెప్పారు. ఉపాధిలో ఎలాంటి తప్పులు జరిగినా సంబంధిత సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మండల కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. జిల్లా విజిలెన్స్ అధికారి గంగాభవాని, ఎంపీడీఓ రెడ్డెప్పఆచారి, ఏపీఓ బాలమురళి పాల్గొన్నారు.

వైభవంగా అనంతపద్మనాభ వ్రతం



వ్రతం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

బైరెడ్డిపల్లె: స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం ఆర్యవైశ్యులు సామూహికంగా అనంతపద్మనాభ వ్రతాన్ని ఆచరించారు. వివిధ రకాల సుగంధ పుష్పాలతో అలంకరించిన మండపంపై అనంతపద్మనాభ స్వామిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. రామక్రిష్ణమాచార్యులు అనంతపద్మనాభస్వామి వ్రత కథ చదివి భక్తులకు వినిపించారు. కొంతమంది గృహాల్లో అనంతపద్మనాభస్వామి చిత్రపటాన్ని కొలువుదీర్చి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

సబ్‌రిజిస్ట్రార్లకు సాధారణ కుర్చీలు



పలమనేరు: బ్రిటీషర్ల పాలన నుంచి మూస పద్ధతిలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల తీరుతెన్నులు ప్రభుత్వ ఆదేశాలతో మారిపోయాయి. జడ్జీలను తలపించేలా ఉండే సబ్‌రిజిస్ట్రార్ల చాంబర్లు సాధారణంగా మారిపోయాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని సబ్‌రిజిస్ట్రార్ల కుర్చీల దర్పానికి తెర పడింది. వాటి స్థానాల్లో సాధారణ కుర్చీలు ప్రత్యక్షమయ్యాయి. మంగళవారం పలమనేరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన క్రయ,విక్రయదారులు గమార్పును చూసి ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ

వి.కోట: వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్ఐ బాబు సూచించారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో సిబ్బందితో కలసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, సీట్ బెల్ట్ పెట్టుకోకుండా కారు డ్రైవ్ చేయడం నేరమన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. వివిధ వాహనాలను తనిఖీ చేసి నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానా విధించారు. ఏఎస్ఐ జయకృష్ణ పాల్గొన్నారు.

పేద విద్యార్థులంటే చిన్నచూపు



ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసినట్లయితే ఎంబీబీఎస్ చదవాలనే పేద విద్యార్థుల భవిష్యత్ చిన్నాభిన్నం అవుతుంది. పేద విద్యార్థుల్లో ఎంబీబీఎస్ చేసి వైద్య రంగంలో ప్రజలకు సేవలందించాలనే కోరిక ఉంటుంది. కానీ అలాంటి విద్యార్థులకు చదువుకునే స్తోమత ఉండదు. పేద విద్యార్థుల కలలను నెరవేర్చడం కోసమే గత ప్రభుత్వంలో కొన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కానీ ఈ ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసి పేద విద్యార్థుల కలలను అడియాశలు చేసేందుకు ప్రయత్నిస్తోంది. అలాంటి ఆలోచనలు ఈ ప్రభుత్వం మానుకోవాలి.

– పట్టాభిరామయ్య, కల్లుపల్లి



సీట్లు తగ్గినందునే కటాఫ్ పెరిగింది



ఎంబీబీస్ సీట్లు తగ్గినందునే ఈ దఫా కటాఫ్ పెరిగింది. అదే ప్రభుత్వ సీట్లు వచ్చుంటే తక్కువ మార్కులున్న వారికి వైద్యవిద్యలో అవకాశాలుండేవి. ఈ ప్రభుత్వ నిర్ణయాలు ప్రైవేటు కళాశాలలకు, డబ్బున్న వారికి సీట్లు పొందేందుకు అవకాశంగా మారాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డాక్టర్లు పెరగాలి. ఇందుకోసం సాధ్యమైనంతగా ప్రభుత్వ మెడికల్ కళాశాల్లో మెడికల్ సీట్లు పెంచాలి. కానీ ఈ ప్రభుత్వంలో సీన్ రివర్స్‌గా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలి.

– గజేంద్ర, పేరెంట్, తొప్పనపల్లి



వి.కోట మండలంలో ఎండిపోయిన జొన్న పంట



బోరులో నీరు రాక ఎండుముఖం పడుతున్న వరి పంట

పలమనేరులో కరువుఛాయలు!

- రెండు నెలలుగా కరుణించని వరుణుడు
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- ఎండుతున్న పంటలు
- పశువులకు దొరకని పశుగ్రాసం

పలమనేరు నియోజకవర్గంలో కరువుఛాయలు కనిపిస్తున్నాయి. గత రెండు నెలలుగా వర్షం జాడలేకుండా పోయింది. దీంతో భూగర్భజలాలు అడుగంటాయి. ఫలితంగా వ్యవసాయబోర్లలో నీళ్లు తగ్గుముఖం పట్టాయి. పంటలకు నీరందక ఎండుతున్నాయి. కనీసం పశువులకు మేత భారంగా మారింది. దీంతో రైతులు ఎట్టాబతికేదో అర్థంగాక ఆకాశంవైపు చూసిచూసి ఆశలు వదులుకున్నారు. పంటకోసం అప్పుచేసిన పెట్టుబడులను ఎలా కట్టాలో తెలియక రైతన్నలు అయోమయంలోపడ్డారు. కొత్తగా బోర్లు వేద్దామన్నా వెయ్యి అడుగులు వేసినా గంగజాడ రావడం లేదు.

– పలమనేరు

ఇదిగో సాక్ష్యాలు

- పలమనేరు మండలం ముడివారిపల్లికి చెందిన నారాయణ అనే రైతు పశువులకు మేతకోసం అరెకరాలో జొన్నసాగు చేశాడు. బోరులో నీళ్ల రాక పంటమొత్తం ఎండిపోయింది. పశువులకు మేత లేకుండా పోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కొత్త బోరు వేయాలంటే రూ.2 లక్షలు కావాలి. అప్పు చేసి వేసినా నీరు పడుతుందనే నమ్మకం లేదు.
- వి.కోట మండలానికి చెందిన కుమార్ అనే రైతు రూ.30వేలు ఖర్చుచేసి దోస సాగుచేశాడు. బోరుబావిలో నీరందక పంటమొత్తం ఎండింది. దీంతో పంట పెట్టుబడి కోసం పెట్టిన రూ.30వేలు పోయిందనే బాధ పట్టుకుంది. ఇకపై పంటసాగు వద్దనుకొని ఖాళీగా ఉంటున్నాడు.

పాతాళానికి చేరిన గంగ

- మూడేళ్ల క్రితం కురిసిన వర్షాలతో ఈ ప్రాంతంలో భూగర్భజలాలు పెరిగాయి. 500 అడుగులు నుంచి 700 దాకా బోరు వేయగానే నీళ్లు పడేవి. ఏడాదిగా వర్షాలు ముఖం చాటేశాయి. ఈసారీ వానలు బాగా తగ్గాయి. దీనికి తోడు వేసవికి మించిన ఎండలు మండుతున్నాయి. గత నెలగా వరుణుడి జాడలేకుండా పోయింది. దీంతో 1000 అడుగులు బోరు వేసినా గంగజాడలేదు. గతంలో రెండు ఇంచ్‌ల నీరు వస్తున్న బోర్లలో ఇంచ్ నీళ్లు మాత్రమే వస్తున్నాయి. 400 దాకా బోర్లు ఎండిపోయాయి. ఇప్పుడే ఇలా ఇంటే వచ్చే వేసవిలో సగానికిపైగా బోర్లు ఎండిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

పశువులకు మేత కష్టం

వ్యవసాయ అనుబంధ రంగమైన పాడిపరిశ్రమ ధరలు తగ్గి ఇప్పటికే ఢీలాపడింది. పశువులకు పచ్చిమేత అసలు దొరకడం లేదు. ఎండుగడ్డి ధరలు భగ్గుమంటున్నాయి. బీళ్లలో సైతం పశుగ్రాసం కానరాలేదు. వర్షాలు రాక భూములు బీడు బారాయి. దీంతో పశువుల మేతకోసం రైతులు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీకావు. కనీసం ప్రభుత్వమైనా పశుగ్రాసాన్ని పంపిణీ చేస్తుందా అనుకుంటే ఆ ఊసే లేకుండాపోయింది.

కృంగిపోతున్న రైతులు

వ్యవసాయాన్నే నమ్ముకున్న రైతులకు సేద్యం గిట్టుబాటు కాకుండా పోతోంది. భూగర్భజలాలు అడుగంటి పంటలు ఎండతుంటే వాటిని చూసి రైతుల గుండె తరుక్కుపోతోంది. చేసిన పంట ఇలా అయితే చేసిన అప్పులు ఎలా తీర్చాలనే బెంగతో రైతులు కృంగిపోతున్నారు. దీంతో నియోజకవర్గంలో అప్పుడే వలసలు ఊపందుకుంటున్నాయి.

“ ఈదఫా పంటలు పోయినట్టే..



బోర్లలో నీళ్లతగ్గిపోయి పంటలు ఎండుతున్నాయి. వానలు రాకుండాపోయాయి. రైతులు అప్పులు చేసి సాగుచేసిన పంటలు చేతికిరాకుండా పోతే ఎలా బతికేదో ఏమో అర్థం కావడంలేదు. వ్యవసాయం చేయడం కన్నా కూలీ పనులు చేసుకోవడం మేలు. ఈ ప్రభుత్వం ఎండిన వేరుశనగను కాపాడితే చాలు దేవరా.

రెడ్డెప్పరెడ్డి, రైతు, టీఎస్ అగ్రహారం, పలమనేరు

పశువుల గోడు ప్రభుత్వానికి పట్టదా.?



బోర్లలో నీళ్ల తగ్గి పంటలు ఎండిపోయాయి. కనీసం పశువులకు మేతైనా ఉంటే పాలు అమ్ముకుని బతకొచ్చు. ఎక్కడా చూసినా బీళ్లు తప్ప పచ్చగా గ్రాసం లేదు. ఎండుగడ్డి కొందామన్నా దొరకడం లేదు. పాలధరలు బాగా తగ్గించేశారు. దీంతో ఉన్న ఆవులను అమ్ముకోవాల్సిందే. ప్రభుత్వం పశుగ్రాసాన్ని పంపిణీ చేయాలి. లేకుంటే ఈ ప్రాంతంలో రైతులు బతకడం కష్టమే.

గిరి, పాడి రైతు, పెంగరగుంట, పలమనేరు మండలం

ఎండుతున్న పంటలు

నియోజకవర్గంలో ఆహారపంటగా ఈ ఖరీఫ్‌లో ఎక్కువగా వేరుశనగ, వరిని రైతన్నలు సాగుచేశారు. ప్రస్తుతం వేరుశనగ కాయ దశలో, వరి కంకి దశలో ఉంది. అయితే నీటి తడులు లేక వరి పంట ఎండుతోంది. వర్షాధారిత పంట వేరుశనగ ఇప్పటికే పూర్తిగా దెబ్బతింది. వాణిజ్యపంటగా టమాటాను ఎక్కువగా రైతులు సాగుచేశారు. దీనికి కూడా ప్రధానంగా నీటి సమస్య ఏర్పడింది. అన్ని రకాల పంటలు వర్షాలు లేక ఎండాకాలంలోలా మండుతున్న ఎండలకు ఎండుతున్నాయి.

నియోజకవర్గంలో పరిస్థితి ఇదీ

వరిసాగు	:	990 ఎకరాలు
వేరుశెనగ	:	24 వేల ఎకరాలు
రాగి	:	120 ఎకరాలు
జొన్న	:	90 ఎకరాలు
టమాట, కూరగాయలు, తీగ పంటలు	:	6 వేల ఎకరాలు
మొత్తం బోరు బావులు	:	21వేలు
జూలైలో సాధారణ వర్షపాతం	:	101.9 మి.మీ కాగా పడింది 31 మి.మీ
ఆగస్టులో సాధారణ వర్షపాతం	:	117 మి.మీ కాగా పడింది 13 మి.మీ
సెప్టెంబర్‌లో సాధారణ వర్షపాతం	:	134 మి.మీ కాకా ఇప్పటిదాకా వర్షమే లేదు

స్టాండింగ్ కౌన్సిల్‌గా కిరణ్‌కుమార్



పుంగనూరు: పుంగనూరు మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా కె.కిరణ్‌కుమార్‌ను నియమిస్తూ కమిషనర్ మధుసూదన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడంతో కిరణ్‌కుమార్ స్టాండింగ్ కౌన్సిల్ పదవికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు పాలకవర్గం ఆమోదంతో కిరణ్‌కుమార్‌ను స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు ఆకుల చెన్నకేశవులు ఆధ్వర్యంలో న్యాయవాదులు నూతన స్టాండింగ్ కౌన్సిల్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ వైస్ ఎంపీపీ రంగయ్యనాయుడు మృతి



రంగయ్యనాయుడు(ఫైల్)

పలమనేరు: మండలంలోని రామాపురానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ రంగయ్యనాయుడు(42) మంగళవారం అనారోగ్యంతో వేలూరు సీఎంసీలో మృతిచెందాడు. వారం క్రితం అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. నేడు బుధవారం ఆయన స్వగ్రామమైన రామాపురంలో అంత్యక్రియలను నిర్వహించనున్నట్టు కుటుంబీకులు తెలిపారు. ఆయన మృతిపై ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, మాజీ ఎమ్మెల్సీ రెడ్డెప్పరెడ్డి, రెడ్డి సంఘ నేతలు చెంగారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ప్రహ్లాద, పెద్దపంజాణి మాజీ ఎంపీపీ విజయ భాస్కర్‌రెడ్డి, మండల సర్పంచుల సంఘ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపీపీలు జయశ్రీ, గజేంద్ర, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాలాజీనాయుడు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

పంటలకు ఈకేవైసీ చేసుకోవాలి



ఈకేవైసీ చేస్తున్న ఏఓ నాగరాజు

గుడుపల్లె: రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటకు ఈనెల 23వ తేదీలోపు ఈకేవైసీ నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి నాగరాజు తెలిపారు. మంగళవారం మండలంలోని చిన్నగొల్లపల్లె, గుడుపల్లె, సంగనపల్లె, గుండ్లసాగరం రైతు సేవ కేంద్రాల్లో ఈపంట నమోదు చేస్తున్న వాటిని పరిశీలించారు.

అండగా నిలిచి సమస్యలు పరిష్కరిస్తాం



చౌడేపల్లెలో ఎంపీ మిథున్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న మిద్దింటి కిషోర్‌బాబు

- ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి
- కన్నబిడ్డను కొట్టి చంపేశారని ఎంపీకి తల్లి ఫిర్యాదు

చౌడేపల్లె: ఎవరికి ఏకష్టమొచ్చినా అందుబాటులో ఉంటాం.. అండగా నిలిచి సమస్యలన్నీ పరిష్కరిస్తామని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి భరోసా కల్పించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తొలిసారిగా ఎంపీ మండల కార్యాలయానికి రావడంతో పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. పార్టీ నేతలు, అభిమానులు తమ సమస్యలను ఎంపీకి వివరించారు. అధైర్యపడకండి మేమున్నామంటూ ఎంపీ భరోసా కల్పించారు. పార్టీ రాజంపేట ఎంపీ సెగ్మెంట్ యూత్ అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబు, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, కల్యాణ్‌భరత్, హరీష్ పవన్ గజమాలతో ఎంపీ మిథున్‌రెడ్డిని సత్కరించారు. సింగిల్‌విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి, రమేష్‌బాబు, మునికృష్ణమనాయుడు, లడ్డూరమణ, వెంకటరమణ,తాణాధర్ నాగరాజ, నాగభూషణరెడ్డి, షంషీర్, ఓబుల్‌రెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, షఫీ, సాధిక్, సనావుల్లా, ఫైరోజ్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఎంపీపీ రామమూర్తిని ఎంపీ పరామర్శించారు.

నాబిడ్డను చంపేశారు.. న్యాయం చేయండి

నాబిడ్డ ఆశా కార్యకర్త సరోజమ్మను ఆమె భర్త లక్ష్మీపతి చంపేశారని న్యాయం చేయాలని ఎంపీ మిథున్‌రెడ్డిని కలసి మృతురాలి తల్లి లక్ష్మి, చెల్లెలు జ్యోతి కన్నీటి పర్యంతమయ్యారు. స్పందించిన ఎంపీ ఈవిషయమై పోలీసు ఉన్నాధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని వారికి భరోసా ఇచ్చారు.



ఘటన గురించి ఎంపీకి వివరిస్తున్న మృతురాలి తల్లి లక్ష్మి, చెల్లెలు జ్యోతి

స్వచ్ఛతా హి సేవ అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పలమనేరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్థానిక మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది, మెప్మా, స్వచ్ఛందసంస్థలు, విద్యార్థులతో కలసి పట్టణంలో స్వచ్ఛతా హి సేవ అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద మావవహారాన్ని నిర్వహించారు. అనంతరం బాపూజీ పార్కు, వారపుసంతలను శుభ్రం చేశారు. అదేవిధంగా ఆర్టీసీ డీఎం టీకేస్వామి ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు డిపో వద్ద నిర్వహించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందామంటూ ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పెరియార్ జయంతి

వి.కోట: మండలంలో పెరియార్ రామస్వామి 145వ జయంతి ఉత్సవాన్ని దళిత ఐక్యకార్యాచరణ సమితి హేతువాద సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతలు గిరిధర్, బాస్ నాయకులు గణపతి, దొరస్వామి, వినోద్, శివరాం సురేంద్ర, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రామకుప్పంలో ద్విచక్రవాహనం దగ్ధం



మంటల్లో కాలిపోతున్న ద్విచక్రవాహనం

రామకుప్పం: మండల కేంద్రంలో ప్రధాన రహదారి పక్కన గల వెల్డింగ్ దుకాణంలో ద్విచక్రవాహనం వెల్డింగ్ చేస్తుండగా అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం పూర్తిగా దగ్ధమైంది. ఎటువంటి నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నిర్మూలన



బైరెడ్డిపల్లెలో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న సీడీపీఓ మాధవిలత



పలమనేరులో మాత్రల పంపిణీ

బైరెడ్డిపల్లె: నులిపురుగులను నివారించేందుకే ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు సీడీపీఓ మాధవీలత పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. జిల్లా అధికారి అర్పిత, సీహెచ్ఓ అనూరాధ, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు డాక్టర్ గిరీషా తెలిపారు. సిబ్బంది నీలకంఠ, జానకి, శిఖామణి, సీహెచ్ఓ రషీద్, సర్తాజ్ పాల్గొన్నారు.

4,071 మందికి మాత్రల పంపిణీ

రొంపిచర్ల: మండలంలో 4,071 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమాన్ని ఎంఈఓ శ్రీనివాసులు ప్రారంభించారు. విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ రాజేశ్వరి, సీహెచ్ఓ కాంతమ్మ, సూపర్‌వైజర్ పంకజ పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: నులిపురుగుల నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పలమనేరు అర్బన్ హెల్త్ ఆఫీసర్ డా.ఆశ అన్నారు. నేషనల్ డీవార్మింగ్ డే సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలను మంగళవారం వైద్యసిబ్బంది పంపిణీ చేశారు. పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పాల్గొన్నారు. మండలంలోని దొడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన ఇదే కార్యక్రమంలో ఎంఈఓ లీలారాణి పిల్లలకు మాత్రలను మింగించారు. కొలమాసనపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలోనూ కార్యక్రమం జరిగింది. ఆరోగ్య పర్యవేక్షకులు లక్ష్మీపతి పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలిన గణపయ్యలు



పలమనేరులో నిమజ్జనానికి తరలుతున్న గణపయ్య



పుంగనూరు: నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు



లడ్డూను వేలంలో దక్కించుకున్న పూజిత్

పలమనేరు: పట్టణ పరిధిలో వినాయకచవితిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన పలు వినాయక విగ్రహాలు పదకొండో రోజైన మంగళవారం నిమజ్జనానికి తరలాయి. యువకులు రంగులు చల్లుకుంటూ, కేరింతలు, నృత్యాల మధ్య నిమజ్జన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా భారీగా బాణసంచా, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆదిఆంధ్ర వీధిలో వినాయకుని లడ్డు వేలం పాటలో రూ.30వేలు పలికింది. దీన్ని పూజిత్ అనే యువకుడు దక్కించుకున్నాడు.

పుంగనూరు: పట్టణంలోని ఎన్ఎస్ పేటలో 22 అడుగుల ఎత్తుగల విజయగణపతి విగ్రహాన్ని మంగళవారం ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు కలసి కోలాహలంగా నిమజ్జనం చేశారు. గణనాథుని విగ్రహానికి ఎన్ఎస్.పేటలో 10 రోజులు ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలు, బళ్లారి డ్రమ్ములు, బాణసంచా నడుమ పట్టణ పురవీధుల్లో గణనాథుని ఊరేగింపు నిర్వహించారు. పట్టణ ప్రజలు గణపయ్యకు టెంకాయలు కొట్టి, మంగళహారతులు ఇచ్చి నిమజ్జనానికి సాగనంపారు. యువకులు అధిక సంఖ్యలో హాజరై , రంగులు చల్లుకుంటూ గణపతి బప్ప మోరియా అంటూ కేరింతలు కొడుతూ నిమజ్జనం చేశారు.